ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
సోమవారం 7 అక్టోబరు 2024

రాజీ కుదిర్చేశారు



- గిల్టు నగలతో రుణాల విషయమై స్టేషన్‌కు వెళ్లి...
- మళ్లీ వెనక్కి వచ్చిన అధికారులు
- గోల్డ్ అప్రైజర్‌తో లోన్ క్లియర్ చేయించిన వైనం
- ఫిర్యాదు చేయకుండా మౌనం వహిస్తున్న బ్యాంకర్లు
- చర్చనీయాంశమైన అధికారుల తీరు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

శ్రీకాకుళం సింహద్వారం జంక్షన్ సమీపంలోని ఓ బ్యాంకులో గోల్డ్ అప్రైజర్.. గిల్టు నగలతో రుణాలు పొందిన విషయం ఇటీవల వెలుగులోకి వచ్చింది. దీనిపై బ్యాంకు అధికారులు గోప్యత పాటించినా.. విషయం బయటకు పొక్కేసింది. దీంతో అంతవరకు మౌనం వహించిన బ్యాంకు అధికారులు.. హుటాహుటిన పోలీసుల వద్దకు రికార్డులు పట్టుకెళ్లారు. ప్రస్తుతానికి బందోబస్తు విధుల్లో బిజీగా ఉన్నామని తర్వాత రావాలని పోలీసులు చెప్పడంతో వెనక్కి వచ్చేశారు. కానీ.. మళ్లీ పోలీసు స్టేషన్‌కు వెళ్లేందుకు ఇష్టపడని ఆ అధికారులు.. బ్యాంకులో జరిగిన మోసాన్ని తమ ఇంటి వ్యవహారంగా భావించి.. ఎంచక్కా రాజీ కుదిర్చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయకుండా గోల్డ్ అప్రైజర్ నుంచి రుణాన్ని రికవరీ చేసినట్టు పక్కా సమాచారం. దీంతో అధికారుల తీరు చర్చనీయాంశమవుతోంది.

● ఫిర్యాదు ఎందుకు చేయలేదు?

బ్యాంకు బ్రాంచ్‌లో పనిచేస్తున్న గోల్డ్ అప్రైజర్.. తన చేతివాటాన్ని చూపి... నకిలీ బంగారాన్ని అసలైనవిగా నిర్ధారించి.. తన కుటుంబ సభ్యులు, పరిచయస్తుల పేర్లతో సుమారు రూ.30లక్షలు వరకు రుణాలు పొందేలా అంతర్గతంగా కారకుడయ్యాడు. బ్యాంకు అధికారులు ఆలస్యంగా గుర్తించినా.. గోల్డ్ అప్రైజరే సూత్రధారిగా నిర్ధారించారు. అతనిని నయానా భయానా ఒప్పించి.. ఎట్టకేలకు ఆయన గిల్టు నగలతో తన అనుచరుల ద్వారా పొందిన లక్షల రూపాయల రుణాన్ని రికవరీ చేసుకున్నట్లు తెలిసింది. తప్పు చేసింది ఖాతాదారుడైనా.. బ్యాంకు సిబ్బందైనా.. ఇంకెవరైనా చర్యలు కఠినంగా ఉండాల్సిందే. అందులో బ్యాంకుల విషయంలో మరింత పకడ్బందీగా అధికారులు దర్యాప్తు నిర్వహించాలి. లేదంటే సంబంధిత బ్యాంకు బ్రాంచ్‌పై ఖాతాదారులకు విశ్వసనీయత పోతుంది. అయితే గోల్డ్‌అప్రైజర్ చేసిన చేతివాటాన్ని నాలుగు గోడల మధ్యన బ్యాంకు అధికారులు పరిష్కరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

● ఇటీవల కోటబొమ్మాళిలో నిర్వహించిన రాష్ట్ర సంబరం కొత్తమ్మ తల్లి పండగకు జిల్లాలో అన్ని స్టేషన్ల నుంచి పోలీసులు బందోబస్తు విధులకు వెళ్లారు. అదే రోజున 'ఆంధ్రజ్యోతి'లో 'గిల్టు నగలతో రుణాలు' అనే శీర్షికతో కథనం వెలువడింది. అంతవరకు మిన్నకున్న బ్యాంకు అధికారులు ఆ ఒక్కరోజు హైడ్రామాకు తెరతీశారు. రాత్రివేళ కొన్ని పుస్తకాలను ఎచ్చెర్ల పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లారు. ప్రస్తుతం బిజీగా ఉన్నామని.. రేపు ఫిర్యాదుచేయాలని పోలీసులు సూచించడంతో మళ్లీ వెనక్కి వచ్చేశారు. ఆ తర్వాత బ్యాంకు అధికారులు మళ్లీ పోలీసు స్టేషన్‌కు వెళ్లలేదు. గోల్డ్ అప్రైజర్‌తో రుణం చెల్లించేసుకుని.. అతనిని గుట్టుగా అప్రైజర్ విధుల నుంచి తప్పించేసినట్లు భోగట్టా. వాస్తవంగా బ్యాంకు సిబ్బంది తప్పు చేయలేదు. కమీషన్ ప్రాతిపదికన పనిచేస్తున్న గోల్డ్ అప్రైజర్ దురాశకు పాల్పడి గిల్టు నగలతో రుణాలను తనవారికి ఇప్పించుకుని.. తన ఉద్యోగానికే ఎసరు తెచ్చుకున్నాడు. కానీ తప్పు చేసిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేయకుండా మౌనంగా వ్యవహరిస్తున్న బ్యాంకు సిబ్బందిపై ఇప్పుడు ఖాతాదారుల్లో అనుమానం కలుగుతోంది. ఫిర్యాదు ఎందుకు చేయలేదు.... వాస్తవం బయటకు వచ్చినా ఫలానా చర్యలు తీసుకున్నామని బహిరంగంగా ఎందుకు చెప్పలేకపోతున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

● సామాన్యుడైతే.. ఇలానే వ్యవహరిస్తారా?

వ్యవసాయ రుణం కోసమో.. వ్యాపార రుణం కోసమో ఖాతాదారుడు వెళ్తే.. పలురకాల నిబంధనలు పెట్టి.. పలుమార్లు బ్యాంకు చుట్టూ తిప్పించుకుంటారు అధికారులు. అయితే గోల్డ్ అప్రైజర్ తన సొంత బ్యాంకు మాదిరిగా గిల్టు నగలతో సుమారు రూ.30 లక్షల వరకు రుణాలను తనవారిపేరుతో తీసుకోవడం విషయంలో ముందే అధికారులు ఎందుకు గుర్తించలేదన్న చర్చ జరుగుతోంది. పైగా సామాన్యుడు ఇలా చేస్తే అతనిపై ఫిర్యాదు చేసి.. బ్యాంకు పరిసర ప్రాంతాలకు రానీయకుండా పకడ్బందీగా వ్యవహరిస్తారు. కానీ గోల్డ్ అప్రైజర్ మోసం బయటపడకుండా అధికారుల వ్యవహరించిన తీరుపై పలు అనుమానాలకు తావిస్తున్నాయి. పైగా ఆ బ్యాంకుకు చెందిన బ్రాంచ్‌పై భవనంలోనే రీజనల్ కార్యాలయం ఉంది. అలాగే లీడ్ బ్యాంకు కార్యాలయం కూడా శ్రీకాకుళంలోనే ఉంది. కానీ విషయాన్ని తొక్కిపెట్టి.. అసలేమీ జరగలేదన్నట్లుగా పోలీసుల వద్దకు వెళ్లి.. మళ్లీ బ్యాంకులోనే రాజీ కుదుర్చుకోవడం చర్చనీయాంశమవుతోంది. దీనిపై ఉన్నత అధికారులైనా దర్యాప్తు చేసి వాస్తవాలను బయట పెట్టాలని ఖాతాదారులు కోరుతున్నారు. బ్యాంకు సిబ్బంది కూడా తమతప్పు లేనప్పుడు పారదర్శకంగా వ్యవహరించాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. 'గిల్టు నగలతో రుణాలు' విషయం రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేరినట్లు విశ్వసనీయ సమాచారం.

11 నెలల తర్వాత వచ్చి..

- పాత తేదీన మట్టి ఖర్చులు చెల్లించేలా సంతకం చేయించేందుకు బ్యాంకు సిబ్బంది యత్నం
- తప్పిదాలను కప్పి పుచ్చుకునేందుకు అంటూ మృతురాలి కుటుంబ సభ్యుల ఆరోపణ
- బ్యాంకులో బంగారం మాయం కేసుపై దర్యాప్తుతో ఉలిక్కి పడుతున్న ఉద్యోగులు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 6: గార ఎస్‌బీఐలో ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల మాయం కేసు మరోసారి తెరపైకి రాగా.. పోలీసులు దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. సుమారు 11 నెలల కిందట ఓ బ్యాంకు ఉద్యోగి మృతిచెందగా.. ఆమె కుటుంబ సభ్యులకు ఇప్పుడు దహన సంస్కారాల నిమిత్తం (మట్టి ఖర్చుల కింద) డబ్బులు చెల్లించేందుకు బ్యాంకు ఉద్యోగులు ప్రయత్నించడం చర్చనీయాంశమవుతోంది. వివరాల్లోకి వెళితే.. గార ఎస్‌బీఐలో బంగారు ఆభరణాల మాయం కేసు విచారణలో భాగంగా పలు వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. ఈ కేసులో 86 బ్యాగుల్లో కుదవ పెట్టిన బంగారం మాయమైనట్లు నాటి బ్యాంక్ ఆర్‌ఎం రాజు గతేడాది నవంబరు 30న ఫిర్యాదు చేయడంతో విచారణ ప్రారంభమైంది. తాకట్టు పెట్టిన ఆభరణాలను బాధితులకు పోలీసులు అప్పగించి.. కేసు విచారణను అర్థాంతరంగా నిలిపేశారు. కాగా.. అప్పట్లో బ్యాంకు ఉద్యోగిణి ఉరిటి స్వప్నప్రియ ఆత్మహత్య చేసుకుంది. ఈ నేపథ్యంలో ఈ నేరాన్ని స్వప్నప్రియపై నెట్టే ప్రయత్నం చేశారంటూ ఆమె కుటుంబ సభ్యులు ఇటీవల జాతీయ మానవ హక్కుల కమిషన్‌తో పాటు హోంమంత్రికి ఫిర్యాదు చేశారు. దీంతో అర్థాంతరంగా నిలిచిన ఈ కేసు దర్యాప్తును ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద పునఃప్రారంభించారు. ఈ కేసులో నాటి ఆర్‌ఎం రాజును ఇటీవల డీఎస్పీ కార్యాలయంలో ఐదు రోజులపాటు విచారించారు. అలాగే నాటి బ్యాంక్ మేనేజర్ రాధాకృష్ణ, క్యాషియర్ సురేష్‌తోపాటు ఆడిట్ నిర్వహించిన వారితో కలిపి మొత్తం 15 మందికిపైగా బ్యాంక్ ఉద్యోగులను డీఎస్పీ విచారణ చేపట్టారు.

● ఇంతవరకు బాగానే ఉన్నా బ్యాంక్‌లో ఉద్యోగి మరణిస్తే.. ఆ వ్యక్తి దహన సంస్కారాల నిమిత్తం (మట్టి ఖర్చుల కింద) 24 గంటల్లో డబ్బులు ఇవ్వడం ఆనవాయితీ. స్వప్నప్రియ విషయంలో మాత్రం బ్యాంకు ఉద్యోగులు నేటికీ మట్టి ఖర్చులు ఇవ్వలేదు. విచారణలో భాగంగా ఈ విషయంపై పోలీసులు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో బ్యాంకు ఉద్యోగులు అప్రమత్త మయ్యారు. పోలీసులు గుర్తించిన ఆడిట్ లోపాలతో పాటు మట్టి ఖర్చుల చెల్లింపు విషయాన్ని కప్పి పుచ్చుకునే పనిలో బ్యాంకు సిబ్బంది పడ్డారంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా శనివారం పీఎన్ కాలనీలోని స్వప్నప్రియ ఇంట్లో హఠాత్తుగా ఎస్‌బీఐ ఉద్యోగులు ప్రత్యక్షమయ్యారు. గతేడాది నవంబర్ 29న ఆమె మరణించగా.. ఇప్పటివరకూ బ్యాంకు ఉద్యోగులు కనీసం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళ్లలేదు. శనివారం స్వప్నప్రియ తల్లి ఉరిటి సరళను ప్రస్తుత గార బ్రాంచ్ మేనేజర్ సతీష్‌తోపాటు బ్యాంక్ సిబ్బంది కలిశారు. స్వప్నప్రియ మట్టి ఖర్చుల కింద డబ్బులు ఇచ్చేందుకు వచ్చామని చెప్పారు. సరే అని ఆమె తీసుకునేలోగా ఓ కాగితం ఇచ్చి దానిపై సంతకం పెట్టాలని సూచించారు. అలా ఎందుకని ఆమె ప్రశ్నించగా.. మట్టి ఖర్చులు ఇచ్చినట్లు సంతకం తీసుకుంటున్నామని వారు చెప్పారు. దీంతో ఆమె తన కొడుకును పిలిచి ఆ కాగితంలో ఏముందో చదివించింది. మట్టి ఖర్చులు 2023 నవంబర్ 30న చెల్లిస్తున్నట్లు అందులో ఉండటంతో.. ఇదేంటని వారు ప్రశ్నించారు. అదంతా తమకు తెలియదని డీజీఎం ఆదేశాల మేరకు ఆర్‌ఎం పంపించడంతో తాము వచ్చామని సిబ్బంది బదులిచ్చినట్లు స్వప్నప్రియ కుటుంబ సభ్యులు తెలిపారు. 11 నెలల తర్వాత వచ్చి.. పాత తేదీన డబ్బులు ఇచ్చినట్లు సంతకం పెట్టించడమేంటని నిలదీయడంతో వారు వెనుదిరిగి వెళ్లిపోయారని స్వప్నప్రియ కుటుంబ సభ్యులు విలేకరులకు తెలిపారు. కేసును నీరుగార్చేందుకు ఇటువంటి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేసేలా విచారణ చేపట్టాలని కోరారు. ఈ విషయమై డీఎస్పీ వివేకానంద వద్ద ప్రస్తావించగా.. ఆడిట్‌లో లోపాలు గుర్తించామన్నారు. దర్యాప్తు కొనసాగుతోందని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మన ఇల్లు మన గౌరవం

- పక్కా ఇళ్ల పూర్తికి బృహత్తర ప్రణాళిక
- అసంపూర్తి నిర్మాణాల వివరాలు సేకరణ
- బిల్లులు, రుణాల మంజూరుకు చర్యలు
- కూటమి ప్రభుత్వ నిర్ణయంపై హర్షం




● మందస మండలం బల్యాసాయి గిరిజన గ్రామంలోని పీఎంఈవై పథకం కింద నిర్మించిన గృహాలివి. స్థానిక వ్యక్తి కాంట్రాక్టర్‌గా వ్యవహరించి.. నిర్మాణాలు అర్థాంతరంగా నిలిపివేశారు. ఉన్న ఇంటిని తొలగించడంతో ఇళ్లు లేక నిర్మాణం పూర్తికాక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 'మన ఇల్లు.. మన గౌరవం' పేరిట కూటమి ప్రభుత్వ నిర్ణయంతో ఇలాంటి గృహాల లబ్ధిదారులకు మేలు చేకూరనుంది.



● మందస మండలం హరిపురంలోని పీఎంఈవై పథకం కింద నిర్మించిన లబ్ధిదారుడు బీఎస్ తిరుమలరావుకు చెందిన ఇల్లు ఇది. బిల్లులు అందక.. శ్లాబ్‌స్థాయిలో నిర్మాణం నిలిచిపోయింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయనుండడంతో తమ ఇంటి నిర్మాణం పూర్తవుతుందని తిరుమలరావు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

(హరిపురం)

వంద రోజుల పాలన పూర్తిచేసుకున్న కూటమి ప్రభుత్వం.. గత వైసీపీ సర్కారు చేసిన తప్పిదాలను సరిదిద్దే ప్రయత్నం చేస్తోంది. పేదలందరికీ ఇళ్లం టూ జగనన్న కాలనీల పేరుతో హడావుడి చేసి వసతుల పేరిట రూ.కోట్లు ఖర్చు చేసినా అసలు లక్ష్యం నేరవేర లేదు. దీంతో కేంద్ర పథకమైన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద (పీఎంఏవై) మంజూరైన ఇళ్ల నిర్మాణాల పూర్తికి కూటమి ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. 'మన ఇల్లు- మన గౌరవం' పేరిట అధికారులను లబ్ధిదారుల వద్దకు పంపి చైతన్యపరుస్తోంది. ఒక్కో అధికారికి రెండు కాలనీల బాధ్యతలు అప్పగించింది. జిల్లాలో పునాది నుంచి లెంటెల్ స్థాయిలో ఇళ్లను 2025 మార్చిలోగా పూర్తి చేయాలని ఆదేశించింది. శ్లాబ్‌స్థాయి, శ్లాబ్ వేసిన వాటిని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది.



నిధులు కేంద్రానివి.. ప్రచారం వైసీపీది..

పీఎంఏవై పథకంలో మంజూరైన ఇళ్ల నిర్మాణానికి అయ్యే ఖర్చంతా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం ఈ ఇళ్లకు జగనన్న కాలనీల బోర్డులు తగిలించి.. తామే ఇస్తున్నట్లు ప్రచారం చే సింది. గతంలో మంజూరైన ఇళ్లు పూర్తికాకుంటే వచ్చే ఏడాది కేంద్రం కొత్తవి మంజూరు చేసేందుకు ఇబ్బందు లు ఏర్పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం లబ్ధిదారులతో మాట్లాడి గృహ నిర్మాణాలు పూర్తి చేయించాలని ఆదేశించింది. ఈ మేరకు అంపూర్తి ఇళ్ల జాబితాను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. ఏ మండలంలో ఎన్ని ఉన్నాయనే దానిపై సమగ్ర సమాచారం సేకరించారు. ఇందుకోసం సచివాలయానికి ఒక నోడల్ అధికారితో బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు లబ్ధిదారులతో మాట్లాడి కారణాలు తెలుసు కుంటున్నారు. అందుబాటులో ఉన్న నిర్మాణదారులకు రుణాలతో పాటు తక్కువ ధరకు సామగ్రి అందజేసి.. పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్ట నున్నారు. గడువులోగా పనులు పూర్తిచేయకపోతే భవిష్యత్‌లో బిల్లులు నష్టపోవాల్సిందే. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు నష్టపోకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

సంఘాల ద్వారా రుణాలు

జిల్లాలో వివిధ దశల్లో ఆగిన ఇళ్లకు స్వయం సహాయక సంఘాలు లేదా బ్యాంకర్ల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తాం. రాష్ట్రంలో పీఎంఏవైలో మంజూరైన నిధులను వినియోగిస్తే తప్ప కొత్త నిధులురావు. గతంలో మంజూరైన నిధులు వచ్చే ఏడాది మార్చికల్లా వెనక్కి వెళ్లిపోతాయి. అసంపూర్తి గృహ నిర్మాణాలకు సిమెంటు, నిర్మాణ సామగ్రి, ఇసుకను ప్రభుత్వమే సరపరా చేస్తుంది.

-బి నగేష్, హౌసింగ్ పీడీ, శ్రీకాకుళం

సద్వినియోగం చేసుకోవాలి

కూటమి ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఒక సాహోసపేత నిర్ణయం తీసుకుంది. పార్టీలకు అతీతంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలనే ఉద్దేశంతో బిల్లులు చెల్లించేందుకు ముందుకు వచ్చింది. దీనిని సద్వినియోగం చేసుకోవాలి. పీఎంఏఈవై 2.0కింద ఇళ్లు రానివారందరికీ మళ్లీ ఇళ్లు మంజూరు చేస్తాం.

-గౌతు శిరీష, ఎమ్మెల్యే పలాస



కొత్తబస్సును ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆధునికీకరిస్తాం

● కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

అరసవల్లి, అక్టోబరు 6: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పూర్తిస్థాయిలో ఆధునికీకరిస్తామని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఆదివారం శ్రీకాకుళంలోని ఒకటో డిపో పరిధిలో ఐదు కొత్త బస్సులను ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్ మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో మరో 2వేల బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నాం. జిల్లాకు మరో 30 కొత్తబస్సులు రావాల్సి ఉంది. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామ'ని తెలిపారు. 'వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. ఢిల్లీ నుంచి తిరుపతికి ఉన్న ఫ్లైట్ కనెక్టవిటీని నిలిపివేశారు. నేను బాధ్యతలు చేపట్టిన వెంటనే పునరుద్ధరించాం. రాష్ట్రంలో కొత్త ఫ్లైట్ కనెక్టివిటీ పెంచామ'ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్, 1,2, డిపో మేనేజర్లు అమరసింహడు, శర్మ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇసుక సరఫరా

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పక్కన ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 6: పారదర్శకంగా ఇసుక సరఫరాకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'జిల్లాలో ఇసుక కొరత లేదు. ప్రస్తుతం 6వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. బుక్ చేసుకున్న 24 గంటల్లోనే సరఫరా చేస్తాం. అక్రమ తవ్వకాలు చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ నెల 16 నుంచి జిల్లాలో కొత్తగా ఆరు ఇసుక రీచ్‌లను ప్రారంభిస్తాం. మరిన్ని కొత్త రీచ్‌లను, డీసిల్టింగ్ కేంద్రాలను గుర్తించాం. వాటిని కూడా త్వరలో అందుబాటులోకి తీసుకువస్తాం. ఇసుకను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా కేటాయిస్తాం. ఇసుక పొందడంలో వినియోగదారులకు సమస్యలు ఎదురైతే.. జిల్లా స్థాయి ఫెసిలిటేషన్ సెంటర్‌ను, **18004256012** (టోల్‌ఫ్రీ), **97016 91657** (వాట్సాప్) నెంబర్లును సంప్రదించాలి' అని సూచించారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ 'ఇసుక అక్రమాలపై చర్యలు తీసుకుంటాం. భారీ జరిమానాతో పాటు, కేసులు కూడా నమోదు చేస్తాం. ఇప్పటివరకు అక్రమార్కులకు రూ.5.75లక్షల జరిమానా విధించాం. పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులతో జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశామ'ని తెలిపారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయిప్రత్యూష పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారిణులు

ఉత్సాహంగా..

- రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీలు
- విద్యలో క్రీడలు అంతర్భాగం
- సమగ్ర శిక్ష రాష్ట్ర పీడీ శ్రీనివాసరావు

ఎచ్చెర్ల, అక్టోబరు 6: ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 బాలికల కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలు ఆదివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి 13 జిల్లాల నుంచి క్రీడాకారిణులు తరలివచ్చి.. పోటీల్లో పాల్గొన్నారు. సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎండీఎం రాష్ట్ర డైరెక్టర్, కమిషనర్ స్కూల్‌ఇన్‌ఫ్రా బి.శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుతో కలిసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యలో క్రీడలు అంతర్భాగం చేయటమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. క్రీడా పోటీలకు అవసరమైన నిధులను విడుదల చేస్తామన్నారు. 'కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకం కింద జిల్లాలో 32 పాఠశాలలకు క్రీడా సౌకర్యాల అభివృద్ధికి రూ.5లక్షల వంతున మంజూరు చేసింది. ఇప్పటికే రూ.2లక్షలు చొప్పున విడుదలయ్యాయి. క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్ధారణతో క్రీడా పరికరాలు సరఫరా చేయనున్నాం. ఖాళీగా ఉన్న పీఈటీ, పీడీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతోంద'ని శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం ఉంటుందన్నారు. చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కేశవరావుపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీఈవో తిరుమల చైతన్య, ఎంఈవో పున్నయ్య, బీజేపీ ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి విశ్వక్సేన్, సర్పంచ్ పైడి భాస్కరరావు, మాజీ సర్పంచ్ భీమారావు, జిల్లా పీఈటీ, పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీ రమణ, ఎస్‌జీఎఫ్ జిల్లాకార్యదర్శి బీవీ రమణ పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు..

తొలిరోజు జరిగిన బాలికల కబడ్డీ పోటీల్లో పశ్చిమగోదావరి జట్టుపై విజయనగరం జట్టు విజయం సాధించింది. అలాగే కర్నూలుపై అనంతపురం, కడపపై తూర్పుగోదావరి, ప్రకాశంపై చిత్తూరు, గుంటూరుపై విశాఖపట్నం, ప్రకాశంపై శ్రీకాకుళం జట్లు గెలుపొందాయి. నెల్లూరుపై విశాఖపట్నం, కడపపై కృష్ణా, చిత్తూరుపై శ్రీకాకుళం జట్లు విజయం సాధించాయి. సోమవారం కూడా పోటీలు కొనసాగనున్నాయి.



పోటీలను ప్రారంభిస్తున్న సమగ్ర శిక్ష పీడీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు

సందడిగా శరన్నవరాత్రులు


శ్రీకాకుళం కల్చరల్: కాలభైరవ ఆలయంలో సువాసినుల పూజలు

జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలు సందడిగా సాగుతున్నాయి. ఆదివారం వివిధ ఆలయాలు, మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమించారు. దీపారాధనలు, కుంకుమ పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.
- ఆంధ్రజ్యోతి బృందం


ఆమదాలవలస: పాలపోలమ్మ..


శ్రీకాకుళం కల్చరల్: అన్నపూర్ణాదేవిగా బొందిలీపురంలోని తుల్జాభవానీ అమ్మవారు


ఎచ్చెర్ల: కుంచాలకురమయ్యపేటలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



పాతపట్నం: నీలమణి దుర్గమ్మ..


జలుమూరు (సారవకోట): అవలింగిలో..


నందిగాం: దుర్గా మండపంలో పూజలు..


ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో దుర్గాదేవి


శ్రీకాకుళం కల్చరల్: విజయదుర్గ ఆలయంలో కుంకుమ పూజలు


టెక్కలి: భవానీ నగర్‌లో లలిత త్రిపుర సుందరీగా..


ఎల్ఎన్ పేట: శ్యామలాపురంలో..


నరసన్నపేట: భవానీ దుర్గ టాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు..


జలుమూరు: రావిపాడు దుర్గాదేవి సన్నిధిలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


టెక్కలి: ఆర్టీసీ కాంప్లెక్స్‌లో దేవీ మండపం వద్ద దీపారాధన

పేలిన గ్యాస్ సిలిండర్

- జిల్లా వాసి మృతి.. ఇద్దరి పరిస్థితి విషమం
- అనకాపల్లి జిల్లా యలమంచిలిలో ఘటన


కేశవరావు (ఫైల్)

ఇచ్ఛాపురం: గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో జిల్లాకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందగా, ఒడిశాకు చెందిన ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉంది. అనకాపల్లి జిల్లా యలమంచిలిలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఇచ్ఛాపురం మండలం కొఠారి పంచాయతీ పత్రిపుట్టుగ గ్రామానికి చెందిన బదకల కేశవరావు(52), ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా సువాని గ్రామానికి చెందిన ఎం.లోకనాథం, జి.కృష్ణారెడి యలమంచిలి మండలం కొత్తూరు సమీపంలోని ఓ సిమెంట్ ఇటుకల తయారీ పరిశ్రమలో కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. ఈ ముగ్గురూ ఒకే ఇంట్లో ఉంటున్నారు. శనివారం అర్ధరాత్రి వంట గది నుంచి గ్యాస్ వాసన రావడంతో అదేమిటో చూసేందుకు లైట్ స్విచ్ వేశారు. దీంతో ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని యలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కేశవరావు ఆదివారం మృతిచెందాడు. మిగిలిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కేశవరావుకు భార్య రాజులమ్మ, కుమారులు శ్రీకాంత్, శశిధర్ ఉన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి


అప్పన్న (ఫైల్)

నరసన్నపేట: చెన్నాపురం గ్రామానికి చెందిన దుండంగి కర్రి అప్పన్న (50) చోడవరం వద్ద ట్రాక్టర్ ఢీకొని మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అప్పన్న తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి సైకిల్‌పై స్వగ్రామానికి వస్తుండగా గెడ్డవానిపేట ములుపు వద్ద ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో అప్పన్నకు తీవ్ర గాయాలు కాగా.. 108 వాహనంలో రిమ్స్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

పొందూరు: వెల్డింగ్ కార్మికుడికి, మండల కేంద్రంలోని ఓ దుకాణం యజమానికి మధ్య శనివారం జరిగిన వివాదంలో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. దుకాణం యజమాని అల్లంశెట్టి శ్రీవికాష్‌కి చెందిన షాపులో మరమ్మతులు చేసేందుకు వెల్డింగ్ కార్మికుడు వడగా నాని వెళ్లాడు. ఈ క్రమంలో వీరిద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న నాని భార్య రమణమ్మ.. అక్కడికి చేరుకుని శ్రీవికాస్‌ని ప్రశ్నించింది. వీరిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ ఘటనలో మహిళనని చూడకుండా అసభ్యపదజాలంతో దూషించాడంటూ శ్రీవికాస్‌పై రమణమ్మ ఫిర్యాదు చేయగా, తనపై రమణమ్మ దాడి చేసిందని శ్రీవికాస్ ఫిర్యాదు చేశాడు. దీంతో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

తప్పిన ప్రమాదం


లారీని ఢీకొన్న లగేజీ వ్యాన్


సరుబుజ్జిలి: మండల కేంద్రం సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు వద్ద ఆదివారం సాయంత్రం ప్రమాదం తప్పింది. ఆమదాలవలస నుంచి హిరమండలం వైపు వెళ్తున్న పంజాబ్ రాష్ట్రానికి చెందిన భారీ వాహనం అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై ఉన్న గుంతల వద్ద ఒక్కసారిగా నిలిచిపోయింది. ఆ వెనుకే వస్తున్న లగేజీ వ్యాన్ ఆ లారీని బలంగా ఢీకొంది. దీంతో ఆ వ్యాన్ ముందుభాగం నుజ్జు అయింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. లారీని వ్యాన్ ఢీకొన్న ఘటన చూసిన ప్రతి ఒక్కరూ భారీ ప్రమాదం జరిగి ఉంటుందని ఊహించుకొని.. ఈ రహదారి గుంతలపై విమర్శలు గుప్పించారు.

శతాధిక వృద్ధుడి మృతి


గరికన్న (ఫైల్)

కొత్తూరు: వంశధార నిర్వాసిత గ్రామమైన గూనభద్ర ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన శతాధిక వృద్ధుడు గార గరికన్న (109) ఆదివారం మృతి చెందారు. వ్యవసాయమే జీవనాధారంగా గరికన్న కుటుంబాన్ని పోషించారు. ఇతనికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారులు కూడా వ్యవసాయం చేస్తున్నారు. ఆయన తల్లిదండ్రులు గార శిమ్మన్న, తల్లి అమ్మన్నమ్మ. వీరిది హిరమండలం మండలం పాడలి గ్రామం. వంశధార ప్రాజెక్టు నిర్మాణంలో భూములు, ఇల్లు కోల్పోయి ఏడు సంవత్సరాల కిందట కొత్తూరు మండలం గూనభద్ర ఆర్అండ్ ఆర్ కాలనీకి తరలివచ్చారు. అప్పటి నుంచి అక్కడే నివాసం ఉంటున్నారు. ఈ మేరకు ఆదివారం వృద్ధాప్యంతోనే మృతి చెందారు.

శ్మశానవాటికకు దారిలేక అవస్థలు


మృతదేహాన్ని అంతిమ సంస్కారాలకు తీసుకువెళ్తున్న దృశ్యం

కొత్తూరు: వంశధార నిర్వాసితులు నివసిస్తున్న గూనభద్ర ఆర్ అండ్ఆర్ కాలనీ ఏర్పాటై ఏడేళ్లయినా శ్మశాన వాటికకు రోడ్డు లేక ఎవరైనా మృతి చెందితే మృతదేహాన్ని తీసుకు వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక పర్యాయాలు అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా స్పందించడం లేదని వారు వాపోతున్నారు. ఆదివారం శతాధిక వృద్ధుడు గార గరికన్న మృతి చెందడంతో అంతిమయాత్రలో పలు ఇబ్బందులు పడ్డారు. గ్రామం నుంచి 1.5 కిలోమీటర్ల దూరంలో శ్మశాన వాటిక ఉండడంతో అనేక ఇబ్బందుల నడుమ పొలాల గట్లపై నుంచి తీసుకువెళ్లి దహన సంస్కారాలు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

హరిపురం: సాబకోట గ్రామం వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న ట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. ట్రాక్టర్‌తో తాళ్లగురంటి గ్రామం సమీపంలోని మహేంద్ర తనయ నదినుంచి చీపి మీదుగా సాబకోటకు ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా వాహనాన్ని ఆపి తనిఖీ చేపట్టగా ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి రెవెన్యూ అధికారులకు సమాచారం అందజేసినట్లు, సీజ్ చేసినట్లు ఎస్ఐ ఖాదర్‌బాషా తెలిపారు.

- **ఇచ్ఛాపురం:** బాహుదానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరి వ్యక్తులను అదుపులోకి తీసుకొని రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం రాత్రి ఈదుపురం బ్రిడ్జి కింద కొచ్చెర్ల తాతారావు ఇసుక అక్రమంగా తరలిస్తుండగా, బాహుదా నది నుంచి రాజారెడ్డి ట్రాక్టరులో ఇసుక తరలిస్తుండగా లొద్దపుట్టి ఫ్లై ఓవర్ వద్ద పట్టుకొని సీజ్ చేసినట్టు తెలిపారు.

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం


ఈవోకు చెక్కును అందిస్తున్న దాతలు

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని నగరంలోని బొందిలీపురానికి చెందిన చింతాడ గోవిందరాజులు, చింతాడ గిరిధర్ శివ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఈవోకు అందజేశారు. వారిని అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, ఈవో వై.భద్రాజీ స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆలయ అనివెట్టి మండపంలో ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం నరసన్నపేటకు చెందిన టి.ఆదినారాయణ బృందం సంగీత విభావరి నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం


బైరిపురంలో భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. ఆదివారం జల్లుపుట్టుగ గ్రామంలో రేషన్ దుకాణాన్ని, బైరిపురంలో యాదవ సామాజిక భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మరింత చేరువగా పథకాలు అందించాలని ఏర్పాట్లు చేశామన్నారు. గత వైసీపీ పాలకులు నిర్లక్ష్యం కారణంగా వ్యవస్థలన్నీ నిర్వీర్యమై పోయాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజుల్లోనే ప్రజలకు మేలు చేసి వ్యవస్థలకు ఒక పద్ధతిలోకి మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు పాటుపడుతున్నారన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పడి అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, సర్పంచ్‌లు పి.రమాదేవి, బి.కిరణ్‌కుమారి, కూటమి నాయకులు మణిచంద్రప్రకాష్, పి.కృష్ణారావు, ఎస్వీ రమణ, బి.రమేష్, బి.చిన్నబాబు, పి.రాజులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో రోహిణి ప్రతిభ


రోహిణిని అభినందిస్తున్న పోలీసు అధికారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్: ఆలిండియా యోగా పోటీల్లో జిల్లాలోని జలుమూరు మండలం లింగన్నాయుడుపేటకు చెందిన రావాడ రోహిణి ప్రతిభ కనబరిచింది. ఇటీవల చత్తీస్‌గడ్‌లోని భిలాయ్ వేదికగా జరిగిన ఆలిండియా పోలీసు క్లస్టర్ యోగా పోటీల్లో పాల్గొన్న రోహిణి రజత పతకం సాధించింది. ఈమె తూర్పుగోదావరి జిల్లా పోలీసు శాఖలో సైబర్ ల్యాబ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. గతంలో ఈమె విశాఖ, జలంధర్, నాగూరులో నిర్వహించిన ఆలిండియా పోలీసు యోగా పోటీల్లో ప్రతిభను చాటింది. ఈమెను డీజీపీ సీహెచ్ ద్వారక తిరుమలరావు, స్పోర్ట్స్ ఐజీ, తూర్పు గోదావరి ఎస్పీ డి.నరసింహకిశోర్, ఏఎస్పీ అల్లూరి వెంకట సుబ్బరాజు అభినందించారు.

థర్మల్ ఉద్యమంపై పుస్తకం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సోంపేట: థర్మల్ పవర్‌ప్లాంట్‌కు వ్యతిరేకంగా సోంపేట పరిసర ప్రాంతాలు పెద్ద ఎత్తున ఉద్యమించారు. ఈ పోరాటంలో ముగ్గురు అసువులు బాసగా.. ఎంతోమంది గాయాలపాలైయ్యారు. ఆనాడు థర్మల్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన ఉద్యమం రాష్ట్ర ప్రభుత్వాన్ని కదిలించగా ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందింది. ఈ ప్రాంతంలో జరుగుతున్న ఉద్యమానికి పర్యావరణ పరిరక్షణ కోసం పరితపించే ఎందరో నేతలు ఈప్రాంతంలో పర్యటించిన దాఖలాలు ఉన్నాయి. బాలగోపాల్, మేధాపాట్కర్, స్వామి అగ్నివేష్ లాంటి గొప్పవ్యక్తులతోపాటు ఎందరో ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచారు. ఇంతగొప్ప ఉద్యమాన్ని ప్రజలకు చూపేందుకు సినీనటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి పీపుల్స్ వార్ చిత్రాన్ని తీశారు. తాజాగా బీలకోసం-బతుకు కోసం పేరుతో మానవహక్కుల పోరం సభ్యురాలు కె.అనురాధ రాసిన పుస్తకాన్ని హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ భవన్‌లో విడుదల చేశారు. ఉద్యమం పురుడుపోసుకున్న పరిస్థితుల నుంచి నేటివరకు జరిగిన ఘటనలు ఇందులో పొందుపరిచారు. ఈ పుస్తకం ప్రారంభోత్సవంలో పర్యావరణ పరిరక్షణ సమితి, మత్స్యకార ఐక్యవేదిక ప్రతినిధులు వై.కృష్ణమూర్తి, బార్ల సుందరరావు, తమ్మినేని రామారావు, బొర్ర రంగనాథం, పండిట్ దానయ్య, కొల నారాయణ, కొదండరావు, దీనబంధు, గోపాల్ తదితరులు ఉన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఆర్డీవో


కేంద్రమంత్రితో ఆర్డీవో ప్రత్యూష

శ్రీకాకుళం అర్బన్: ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం ఆర్డీవోగా నియమితులైన కె.సాయి ప్రత్యూష ఆదివారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌ను, ఎమ్మెల్యే గొండు శంకర్‌ని కలుసుకున్నారు. టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి కేంద్రమంత్రిని కలుసుకున్నారు.

వాహన తనిఖీల్లో అప్రమత్తంగా ఉండాలి


చెక్ పోస్టును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

రణస్థలం: చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఇసుక లారీలకు సంబంధించిన బిల్లులు పరిశీలించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి పైడిభీమవరం వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్తగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఇసుక లారీలకు పక్కాగా బిల్లులు ఉండాలని, అనుమానం వస్తే ఇసుక లారీలను పోలీస్ స్టేషన్ వద్ద ఉంచాలన్నారు. నాలుగు గంటల సమయంలో బిల్లులు లేని ఇసుక లారీ పట్టుకున్నట్టు సిబ్బంది వివరించారు. ఇంతవరకు కేసు నమోదు చేయకపోవడంపై సిబ్బందిపై మండిపడ్డారు. చెక్ పోస్టు వద్ద పూర్తి స్థాయిలో లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

మద్యం దుకాణాలకు 260 దరఖాస్తులు


మాట్లాడుతున్న డీపీఈవో తిరుపతినాయుడు

శ్రీకాకుళం రూరల్: జిల్లాలో 158 మద్యం దుకాణాల ఏర్పాటుకు ఇప్పటి వరకు 260 దరఖాస్తులు వచ్చినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీపీఈవో సీహెచ్ తిరుపతినాయుడు తెలిపారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శ్రీకాకుళం సర్కిల్‌లో 32 దుకాణాలకు గాను 74, ఆమదాలవలస 13 దుకాణాలకు 18, రణస్థలం 15కి 66, పొందూరు 10కి 18, నరసన్నపేట 12కి 10, కొత్తూరు 7కి 13, పాతపట్నంలో 8కి 2, కోటబొమ్మాళి 15కి 11, పలాస 15కి 32, సోంపేట 12కి 12, ఇచ్ఛాపురంలో 8 దుకాణాలకు 12 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తులు సమర్పించే సమయంలో అభ్యర్థి లేకపోతే అతడి తరఫున ధృవీకరణ పత్రం జతచేయాలని స్పష్టం చేశారు. దుకాణం సొంత చేసుకున్న సందర్భంలో కూడా అభ్యర్థి లేనిపక్షంలో అతడి ధృవీకరణ పత్రం సమర్పించాలన్నారు. మరో రెండు రోజులే గడువు ఉన్నందున ఆశా వాహులు త్వరితగతిన దరఖాస్తులు సమర్పించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం ఎక్సైజ్ సీఐ ఎం.వీ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

శ్రీకాకుళం రూరల్: వ్యక్తిగత కక్షలకుపోయి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని శ్రీకాకుళం సీఐ కె.పైడపునాయుడు అన్నారు. ఆదివారం సర్కిల్ పరిధిలోని పలు సమస్యాత్మక గ్రామాలను సీఐ పైడపునాయుడు సందర్శించారు. ఇటీవల సానివాడలో యువత రాజకీయ ప్రలోబాలకు లోబడి పరస్పర విమర్శలకు పాల్పడుతున్నారన్న సమాచారం మేరకు ఆ గ్రామంలో యువతతో సమావేశమై శాంతిభద్రతలపై అవగాహన కల్పించారు. యువత రాజకీయ వివాదాల్లో తలదూర్చడం వల్ల తమ భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

కేశుపురంలో మెగా రక్తదాన శిబిరం

ఇచ్ఛాపురం: ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ఆదివారం కేశుపురంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కేశుపురం పంచాయతీ పరిధిలో గల సన్యాసిపుట్టుగ, నీలాపుపుట్టుగ గ్రామాల్లో మెగా ఉచిత వైద్య శిబిరంతో పాటు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మూడు గ్రామాల నుంచి వచ్చిన 200మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు సాయికుమార్, మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు, డి.కామేష్, సహదేవ్‌రెడ్డి, బి.రాజేంద్రప్రసాద్, యువరాజు, దుర్యోదన, హరీష్, ఎస్.గణపతి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి పూజ

సోంపేట: లక్కవరం గ్రామంలో సరస్వతీదేవి పూజ ఆదివారం ఘనంగా నిర్వహించారు. విజయదశమి సందర్భంగా ప్రత్యేకంగా పూజనిర్వహించి తీర్థ, ప్రసాదాలు పంచిపెట్టారు.

రోడ్డు పక్కనే చెత్త కుప్పలు

గార: మండల కేంద్రం గారలో వంశధార నదికి వెళ్లే రోడ్డుకి ఒక వైపుగా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో అటు వైపుగా వెళ్లేవారు ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. ఈ రోడ్డుకి మరో వైపు హైస్కూల్ అంగన్‌వాడీ సెంటర్, బాలుర వసతి గృహం కూడా ఉన్నాయి. దగ్గరలోనే పశువైద్యశాల, మండల రీసోర్స్ సెంటర్ ఉన్నాయి. ప్రస్తుతం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు నిర్వహించినా.. ఇక్కడి పరిస్థితి మారకపోవడం దురదృష్టకరం. ఈ చెత్త కుప్పలు కారణంగా అక్కడ ఈగలు దోమలు వృద్ధి చెంది అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు ఈ చెత్త కుప్పలు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు పక్కనే ఉన్న చెత్త కుప్పలు →




9న జిల్లా స్థాయి చెస్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్: నగరంలోని నానుబాల వీధిలోని చెస్ శిక్షణ శిబిరంలో జిల్లాస్థాయి చెస్ పోటీలు ఈ నెల 9న నిర్వహించనున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బగాది కిశోర్ చెప్పారు. అండర్-15 విభాగంలో పాల్గొనేవారు 2009 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించినవారై ఉండాలన్నారు. ఆసక్తి గల వారు ప్రవేశ రుసుం రూ.300 చెల్లించాలన్నారు. విజేతలు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాల 99125 59735కు సంప్రదించాలని కోరారు.

గార డీటీగా పద్మావతి

గార: మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ (డీటీ)గా డి.పద్మావతి బాధ్యతలు స్వీకరించారు. ఈమె సరుబుజ్జిలి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతవరకు ఇక్కడ డీటీగా పనిచేసిన ప్రసాదరావు కోటబొమ్మాళి బదిలీ అయింది.

మత్స్యకార ఐక్యవేదిక అధ్యక్షుడిగా తమ్మారావు


తమ్మారావు

సోంపేట: తీరప్రాంత మత్స్యకార ఐక్యవేదిక అధ్యక్షుడిగా బడే తమ్మారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బారువ సముద్రతీరంలో ఆదివారం సమావేశం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బడే గురుమూర్తి, ప్రధాన కార్యదర్శిగా బైపల్లి దాలయ్య, కార్యదర్శిగా సూర్ని రమేష్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో మాజీ అధ్యక్షుడు వాసుపల్లి కృష్ణారావు, మాదా సోమయ్య, సూరాడ చంద్రమోహన్, వాసుపల్లి కృష్ణ, మద్దు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జీపీడీపీ శిక్షణ

ఇచ్ఛాపురం: ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నుంచి రెండు రోజులు పాటు జీపీడీపీ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రామారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి శిక్షణ తరగతులు ప్రారభమవుతాయని, ప్రతీ పంచాయతీ నుంచి ఉప సర్పంచ్, ఇద్దరు వార్డు మెంబర్లు హాజరు కావాలని కోరారు.

కొనసాగుతున్న టెట్ పరీక్షలు

ఎచ్చెర్ల: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) జిల్లాలోని మూడు కేంద్రాల్లో కొనసాగుతోంది. ఆదివారం రెండు షిఫ్ట్‌ల్లో కలిపి శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో 340కు 313 మంది, వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 199కు 163 మంది హాజరయ్యారు. ఈ నెల 3వ తేదీన ప్రారంభమైన ఈ పరీక్షలు 21వ తేదీ వరకు జరగనున్నాయి.

ఆదిత్యుని ఆదాయం రూ.3.95 లక్షలు

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఒక్క రోజు స్వామివారికి రూ.3,95,254 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.1,47,500, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.1,67,045, విరాళాల ద్వారా రూ.80,709 ఆదాయం లభించిందని ఈవో వై.భద్రాజీ తెలిపారు.

సేవ చేసి తరించాలి

శ్రీకాకుళం కల్చరల్: పేదలకు, అనాథలకు, వృద్ధులకు అన్నదానం, ఆర్థిక సాయం వంటి సేవా కార్యక్రమాలతో ప్రతి ఒక్కరూ తరించాలని సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్ష్మణరావు అన్నారు. ఆదివారం బ్యాంకర్స్ కాలనీలోని సాయి బృందావనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్లు, జిల్లా పదాధికారులు పాల్గొని మాట్లాడారు. సత్యసాయి సేవా సంస్థలు రాష్ట్రంలో సేవా కార్యక్రమాలు నిర్వహణలో ప్రథమ స్థానంలో ఉన్నాయని, దీనికి శ్రీకాకుళం జిల్లా శాఖ అందిస్తున్న సేవలే ఆదర్శమన్నారు. జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, పూర్వపు అధ్యక్షుడు గంగుల రమణబాబు, ప్రతినిధులు కమలాత్రివేణి, బోయిన నరసింహమూర్తి, పప్పల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాధితుడికి సాయం

ఇచ్ఛాపురం: తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన డి.లింగరాజు కొన్నాళ్లగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ సంస్థ ఆదివారం రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

రహదారిద్ర్యం

- కనీస మరమ్మతులకు నోచుకోని వైనం
- ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రాంత ప్రజలు

ఏ రోడ్డు చూసినా ఏమున్నది గర్వకారణం.. అన్నీ గోతులమయం.. నీళ్లతో నిండినవైనం.. ఇదీ జిల్లాలోని పలు ప్రాంతాల్లోని రహదారుల దుస్థితి.. గడచిన ఐదేళ్లలో కనీస మరమ్మతులు చేపట్టకపోవడం, వర్షాలకు మరింత దారుణంగా తయారై కనీసం నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి.. గోతులను దాటుకుని వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే.. ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా గోతుల్లో పడి గాయపడడంతో పాటు వాహనాలు మూలకు చేరాల్సిందే.. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్లను బాగు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం


పలాస రూరల్: రెంటికోట కాలనీ వద్ద ప్రమాదకరంగా ఉన్న రోడ్డు


టెక్కలి: ప్రసిద్ధ శైవక్షేత్రం రావివలస గ్రామంలోని కాలనీ వద్ద ఇలా..


జలుమూరు: పాగోడు కొత్తూరు నుంచి రామయ్యవలస రోడ్డు..


కొత్తూరు: గొట్టిపల్లికి వెళ్లే దారి ఇది..


ఎల్ఎన్‌పేట: బొర్రంపేట వద్ద దారుణంగా ఉన్న అలికాం-బత్తిలి ప్రధాన రోడ్డు


ఎల్ఎన్‌పేట: రాళ్లు తేలిన కడపలగెడ్డ రోడ్డు


నందిగాం: శివరాంపురం-సైలాడ మార్గంలో ఇలా..


పలాస రూరల్: టెక్కలిపట్నం వద్ద రోడ్డు దుస్థితి

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

టెక్కలి: కౌలురైతులకు గుర్తింపుకార్డులు ఇచ్చి బ్యాంకు రుణాలు అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావు అన్నారు. ఆదివారం సుఖదేవపేట గ్రామంలో కొల్లి రామారావు అధ్యక్షతన కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌలురైతులకు ఆదుకుంటామని పాలకులు ఇచ్చిన హామీలు గాలిలో కలిసి పోయాయని విమర్శించారు. రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల హామీగా ఇచ్చిన అధికార పార్టీ నేడు దానిని విస్మరించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం మద్దతు ధర పెంపు ఏడాదికి రూ.100 పెంచి చేతులు దులుపుకుంటోందన్నారు. సమావేశంలో సీపీఎం నాయ కులు నంబూరు షణ్ముఖరావు, బగాది వాసుదేవరావు, బాలరాజు, భీమారావు, సంజీవ రావు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవల్లో అలసత్వం వీడాలి: ఆర్డీవో


రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి: రెవెన్యూ సేవల్లో అలసత్వం వీడి ప్రజల కోసం ఇష్టంగా పనిచేయాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో టెక్కలి డివిజన్ తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. ప్రతి సోమవారం 'మీకోసం'లో ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది పని చేసే తీరే ప్రజ ల వద్ద గుర్తింపునిస్తుందన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

యువజన సంఘ ప్రతినిధుల శ్రమదానం


శ్రమదానం చేస్తున్న యువజన సంఘ సభ్యులు

వజ్రపుకొత్తూరు: పల్లిసారధి నుంచి గొల్లసారధి వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు, తుప్పలను ఆదివారం పల్లిసారధి జన చైతన్య అర్ప్ యువజన సంఘం ప్రతినిధులు శ్రమదానం చేసి తొలగించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఉప్పరపల్లి వాసు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను వినియోగించుకోండి: ఎమ్మెల్యే బగ్గు



నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 8న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. ఈ మేరకు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. పదో తరగతి పాసై 18-30 మధ్య వయసున్న అభ్యర్థులు ఐటీఐ, డిగ్రీ, ఫార్మశీ చదివిన విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలను కల్పించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని యువతీ యువకులు వినియోగించుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయిలో పోటీల్లో రాణించాలి


రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన జట్టుతో అసోసియేషన్ సభ్యులు

నరసన్నపేట: రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రాణించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.గోపి అన్నారు. ఈనెలలో విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయిలో పోటీలకు ఆదివారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా జట్టును ఎంపిక చేశారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనపరచడంపై హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శ బంకుపల్లి రవికుమార్, ఉపాధ్యక్షుడు రమేష్, కార్యదర్శి అరవింద్‌కుమార్, సృజన్‌కుమార్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చింతల పోలమ్మ గుడి ప్రారంభానికి అంకురార్పణ

వజ్రపుకొత్తూరు: బైపల్లిలో నిర్మించిన చింతలపోలమ్మ అమ్మవారు గుడి ప్రారంభోత్సవానికి ఆదివారం అంకురార్పణ చేశారు. మూడురోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చివరిరోజు మంగళవారం ఘటాలతో భారీ ఊరేగింపు, అమ్మవారికి ముర్రాటలు సమర్పణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో రామదాసుపేట కోలాట బృందం


తిరుమలలో ప్రదర్శన ఇచ్చిన రామదాసుపేట కోలాట బృందం

జలుమూరు: అల్లాడ పంచాయతీ రామదాసుపేట గ్రామానికి చెందిన నమో వేంకటేశ కోలాట బృందం తిరుమల బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ప్రదర్శన ఇచ్చారు. బృంద అధ్యక్షురాలు మెండ కృష్ణవేణి ఆధ్వర్యంలో మహిళలు స్వామివారి గరుడ సేవ తిరువీధిలో భాగంగా నాలుగు మాడ వీధుల్లో కోలాట నృత్య ప్రదర్శన ఇచ్చారు. తిరుమల బ్రహ్మోత్సవాల్లో ఇటువంటి అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామని, స్వామిపై ఉన్న భక్తి, గౌరవంతో ఆయన పాదాల చెంత ప్రదర్శన మరువురానిదని కృష్ణవేణి అన్నారు. ● **నరసన్నపేట:** తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం నరసన్నపేటకు చెందిన నాలుగు బృందాలు పాల్గొన్నాయి. గత రెండురోజులుగా ఒక్కో బృందం స్వామివారి తిరువీధి ఉత్సవంలో కోలాట ప్రదర్శన నిర్వహించారు. పట్టణం నుంచి నాలుగు బృందాలు ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో పాల్గొంటున్నాయి.

'మిషన్ వాత్సల్య' కోసం దరఖాస్తులు

పాతపట్నం: పాతపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 2024-25 సంవత్సరానికి గాను 'మిషన్ వాత్సల్య' పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీవో టి.విమలారాణి ఒక ప్రకటనలో తెలిపారు. నిరుపేద, నిస్సహాయ స్థితిలో ఉన్న పిల్లలకు వైద్యవిద్య కోసం నెలకు రూ.4 వేల చొప్పున అదనపు సాయం కోసం ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి 18 ఏళ్లలోపు వయసు ఉండాలన్నారు. తల్లిదండ్రులు కోల్పోయి ఇతర కుటుంబంతో నివసిస్తున్న అనాథ పిల్లలు అర్హులన్నారు. తల్లిదండ్రులిద్దరూ ప్రాణాంతక వ్యాధి బారినపడి ఉండాలన్నారు. బాలన్యాయ, రక్షణ, ఆదరణ చట్టం-2015 ప్రకారం సంరక్షణ లేదా ఆదరణ అవసరమైన పిల్లలకే ఈ పథకం వర్తిస్తుందన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలు మించి ఉండరాదన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు, రేపు వార్డు సభ్యులకు శిక్షణ

నందిగాం: మండలంలోని ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సోమ, మంగళవారాల్లో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో టి.రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పంచాయతీల వారీగా శిక్షణ ఉంటుందని తెలిపారు. ● **ఎల్.ఎన్.పేట:** మండలంలోని 22 పంచాయతీల వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌లకు సోమ, మంగళవారాల్లో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్డీ ఎస్.శ్రీనివాసులు తెలిపారు. ప్రతీ పంచాయతీ నుంచి ఉప సర్పంచ్‌తోపాటు ఇద్దరు వార్డు సభ్యులు శిక్షణకు హాజరుకావాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంకాలం నాలుగు గంటల వరకు ఉంటాయన్నారు. ● **పోలాకి:** పంచాయతీల్లోని ఉప సర్పంచ్, ఒక మహిళ, ఒక పురుష సభ్యులకు ఎంపీడీవో కార్యాలయంలో సోమ, మంగళవారాల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గరిమెళ్ల రవికుమార్, ఏవో బలగ సూర్యప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. మండలంలోని కోడూరు, మగతపాడు మినహా 29 పంచాయతీల నుంచి ఉప సర్పంచ్ ఒక మహిళ, ఒక పురుష సభ్యుడు హాజరవ్వాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు.

క్రీడాకారులకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ వితరణ

నరసన్నపేట: జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన జమ్ము గ్రామానికి చెందిన రుప్ప పుష్పలతకు, అంతర్జాతీయ ఈత పోటీలకు వెళ్లనున్న టెంక ప్రేమ్‌కుమార్‌కు జాతీయ మానవహక్కుల కౌన్సిల్ సభ్యులు ఆదివారం సాయమందించారు. పేద కుటంబాలకు చెందిన క్రీడాకారులకు చేయూత నిచ్చేందుకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ అండగా నిలిచిందని నరసన్నపేట, పలాస నియోజవర్గాల చైర్మన్ కె.చిన్నవాడు అన్నారు. కార్యక్రమంలో పంగ శివయ్య తలసముద్రం రాజారావు, మెయ్య జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

కొత్త పోర్టుల వద్ద వేర్‌హౌస్ గొడౌన్ల నిర్మాణం

- ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు



పలాస, అక్టోబరు 6: రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న పోర్టులకు అనుసంధానంగా పది ఎకరాల విస్తీర్ణంలో వేర్‌హౌస్ గొడౌన్లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) చైర్మన్ వజ్జ బాబూరావు తెలిపారు. చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న తరువాత తొలిసారిగా పలాస-కాశీబుగ్గకు వచ్చిన ఆయన ఆదివారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ.. గొడౌన్ల నిర్మాణం వల్ల సంస్థకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఏపీ నిర్మన్ యాప్ ద్వారా మొత్తం కార్యక్ర మాలు నిర్వహిస్తున్నామన్నారు. తమ శాఖ పరిధిలో రాష్ట్రంలో ఆదాయం ఇచ్చే సంస్థలు అనేకం ఉన్నాయని, విశాఖపట్నంలో అధి కంగా గొడౌన్లు, షాపింగ్ మాల్స్ ఉన్నాయని వాటి ద్వారా రూ.లక్షల అద్దెలు వస్తున్నా యన్నారు. విశాఖపట్నం నడి బొడ్డులో ఉన్న స్పెన్సర్ షాపింగ్ మాల్ లీజు గడువు పూర్తయిందని, కొత్తగా లీజుకు ఇచ్చేందుకు టెండర్లు పిలవగా అదనంగా ఆదాయం వచ్చిందని, అయితే దీన్ని తమకే కేటాయించాలని సంబంధిత సంస్థ కోర్టుకు వెళ్లడంతో టెండరు ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిందన్నారు. కోర్టు ఆదేశాల మేర కు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాల్లో ట్రేడ్ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయబోతున్నామని, ఇందులో సంస్థ కార్యకలాపాలు, ప్రోత్సాహకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో శాఖ పరిధిలో కోల్డ్‌స్టోరేజీలు నిర్మించేందుకు ప్రతిపాదనలు ఉన్నాయని, దీనిపై సీఎం చంద్రబాబునాయుడుతో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు ఏపీటీపీసీ సంస్థ బలీయంగా ఉండేదని, రాష్ట్ర విభజనతో ఆస్తులు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. మరలా సంస్థను బలోపేతం చేసేందుకు చర్య లు తీసుకుంటామన్నారు.

కిడ్నీ వ్యాధి నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలి

- ప్రొఫెసర్ కేఎస్ చలం


'ఉద్దానం కిడ్నీ విషాదాలు' పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రొఫెసర్ చలం

పలాసరూరల్: ఉద్దానంలో కిడ్నీ వ్యాధి నివారణకు శాశ్వత పరిష్కారం కావాలని, దీనికోసం ప్రజా ఉద్యమం కొనసాగించాలని ప్రొఫెసర్ కేఎస్ చలం అన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం గిడుగు రామమూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం, కళింగసీమ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో 'ఉద్దానం కిడ్నీ విషాదాలు' పుస్తకా విష్కరణ కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్దాన ప్రాంతంలో పౌరసమాజం అంతా మేల్కొని ఉద్యమం చేయా లన్నారు. కిడ్నీవ్యాధి ఎంతో మందిని కబళించిందని, దీనికి నివారణ, మందులు కచ్చితంగా వచ్చిన నాడు మరణాలను తగ్గిం చవచ్చన్నారు. కిడ్నీ వ్యాధికి గురైన వారు సరైన ఆహారం, నియమాలు పాటించి ముందు జాగ్రత్త చర్యగా మసలు కోవా లన్నారు. పాల కులు చిత్తశుద్ధితో వ్యవహరించి వ్యాధి శాశ్వత పరిష్కారానికి సరైన మార్గం చూపించాలని సూచించారు. కార్యక్రమానికి కళింగసీమ సాహిత్య సంస్థ అధ్యక్షుడు సన్నశెట్టి రాజశేఖర్ అధ్యక్షత వహించగా వైద్యులు మల్లేశ్వరరావు, తెప్పల ఆనందరావు, గిరిబాబు, పుస్తక రచయిత బద్రి కూర్మారావు, కవి బమ్మిడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. కళాకారుడు దుర్యోధన కిడ్నీ బాధితుల వేదనపై గీతాలను ఆలపించారు.

జీడి మొక్కలతో రైతులకు ఆర్థిక భరోసా

హరిపురం: జీడి మొక్కలతో రైతులకు ఆర్థిక భరోసా లభిస్తుందని మండల ఉద్యాన వన శాఖాధికారి శంకర్ దాస్ అన్నారు. హరిపురంలో రాయితీపై జీడి మొక్కల పంపిణీని ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ జీడి మొక్కలను సద్వినియోగం చేసుకొని జీడి పంట విస్తరణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారి భాగ్యలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, నేతలు లబ్బ రుద్రయ్య, కొత్ర వైకంఠరావు, ప్రకాశరావు, రఘుపతి పాల్గొన్నారు.

జావెలిన్‌త్రోలో రుషికుమార్‌కు ప్రతిభ



సంతబొమ్మాళి: బోరుభద్రకు చెందిన మార్పు రుషికుమార్ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచాడు. విజయవాడలో ఆదివారం జరిగిన పోటీల్లో జావెలిన్‌త్రో విభాగంలో రాష్ట్ర స్థాయిలో 2వ స్థానం సాధించి వెండి పతకాన్ని సాధించాడు. రుషి కుమార్ తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. రాష్ట్రస్థాయి పోటీల్లో వెండిపతకం సాధించడంతో గ్రామస్థులు అభినందించారు.

58 ఏళ్ల తరువాత అ'పూర్వ' కలయిక


58 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

హిరమండలం: హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1967-68 సంవత్సరంలో ఎస్ఎస్ ఎల్‌సీ చదువుకున్న విద్యార్థులు ఆదివారం స్థానిక రామేశ్వరి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 58 ఏళ్ల తరువాత వారంతా కలుసుకుని నాటి అనుభవా లను నెమరువేసుకుని ఆనందం పొందారు. అప్పటిలో 44 మంది విద్యార్థులు ఎస్ఎస్ ఎల్‌సి చదవగా వారిలో 19 మంది మృతి చెందారు. మిగిలిన 25 మంది వయోభారాన్ని సైతం లెక్క చేయకుండా ఒకచోట చేరి మృతి చెందిన సహచరులకు నివాళి అర్పించారు. ప్రస్తుత పరిస్థితులు, నాటి జ్ఞాపకాలను ఒకరికొకరు తెలుసుకుని ఆనందం వ్యక్తంచేశారు. అలాగే ఇదే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992-97 మధ్యచదువుకున్న విద్యార్థులు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కష్టంలో ఉన్న సహచరులను ఆదుకోవాలని నిర్ణయించారు. నాటి జ్ఞాపకాలను ఒకరికొకరు తెలుపుకుని ఆనందం పొందారు.


1992-97 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులు

కొత్తూరు ఉన్నత పాఠశాలలో..

కొత్తూరు: కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997-98 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం నిర్వహించారు. అప్పటి విద్యార్థులు ముగితి లక్ష్మణరావు, ఐ.శంకర్, మల్లా శ్రీకాంత్, రాము మాస్టార్, కవిత, శివ, నిర్మల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఒకరికొకరు పలుకరించుకుని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నాటి ఉపాధ్యాయులను, ప్రస్తుత హెచ్ఎం ఎ.గోవిందరావును సత్కరించారు.


1997-98 సంవత్సరం పూర్వ విద్యార్థులు